క్లుప్తంగా

సమస్యల పరిష్కారానికి ఉద్యమం

- ఎన్ఎంయూ జోనల్ కార్యదర్శి చెన్నారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న చెన్నారెడ్డి

మడకశిర: ఆర్టీసీ కార్మికుల సమస్యలను పరిష్కరించడానికి ఉద్యమం చేస్తామని ఎన్ఎంయూ జోనల్ కార్యదర్శి చెన్నారెడ్డి తెలిపారు. ఆదివారం పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో ఎన్ఎంయూ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఉద్యోగ భద్రతా సర్క్యులర్‌పై ఎన్ఎంయూ నాయకులు చర్చించారు. చెన్నారెడ్డి మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఆర్టీసీ కార్మికుల సమస్యలపై పోరాటం చేస్తామన్నారు. మడకశిర డిపో పరిధిలో రద్దు చేసిన సర్వీసులను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. గ్యారేజ్ సిబ్బంది సమస్యలను పరిష్కరించడానికి కూడా ఆందోళనలు చేస్తామన్నారు. సమావేశంలో ఎన్ఎంయూ జిల్లా అధ్యక్షుడు అశ్వర్థయ్య, జిల్లా చైర్మన్ ముత్యాలప్ప, జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు రాజారెడ్డి, జిల్లా కార్యదర్శి షబ్బీర్, స్థానిక ఎన్ఎంయూ నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ అధ్యక్షుడిగా రాజేష్ గుప్తా

గోరంట్ల: స్థానిక ఎస్కేఆర్ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో గోరంట్లలోని ప్రముఖులు, విద్యావేత్తలు, సంఘం సంస్కర్తలు కలసి నూతనంగా లయన్స్ క్లబ్ శాఖ ఏర్పాటు చేశారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడిగా రాజేష్ గుప్తా, ఉపాధ్యక్షుడిగా డీకే శ్రీనివాసులు, కార్యదర్శిగా నాగరాజు, కౌన్సిల్ బాడీ సభ్యుడిగా దస్తగిరి, శివప్రకాష్, గిరిధర్‌గౌడ్ తదితరులను నియమించారు. నూతనంగా ఏర్పాటు చేసిన లయన్స్‌క్లబ్ ద్వారా సేవా కార్యక్రమలు చేపడతామన్నారు.

26న కృష్ణాష్టమి



పోస్టర్లు విడుదల చేస్తున్న యాదవ సంఘం నాయకులు

సోమందేపల్లి: మండలంలో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు యాదవ సంఘం నాయకులు తెలిపారు. మండల కేంద్రమైన సోమందేపల్లిలోని కాలమ్మ ఆలయం వద్ద సంఘం సమావేశమై ఉత్సవ పోస్టర్లు విడుదల చేశారు. ఈ నెల 26న కృష్ణాష్టమి సందర్భంగా ఉత్సవ విగ్రహ ఊరేగింపు, సాంస్కృతిక కార్యక్రమాలు, కృష్ణుడు, గోపీకల వేషధారణలతో పాటు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. యాదవ కులస్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో యాదవ సంఘం నాయకులు నారాయణ స్వామి, శ్రీనివాసులు, నర్సింహులు, మహేష్, ప్రభాకర్, ధనుంజయ, లక్ష్మీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

నాగళూరులో తైలాభిషేక పండుగ



ప్రార్థన చేస్తున్న పాస్టర్ లూకా బాబు

పెనుకొండ రూరల్: మండలంలోని నాగళూరు గ్రామంలో బైబిల్ మిషన్ చర్చిలో ఆదివారం తైలాభిషేక పండుగను నిర్వహించారు. ఇందులో భాగంగానే బైబిల్‌లోని విషయాలను చర్చి పాస్టర్ లూకా బాబు బోధించారు. అనంతరం విశ్వశాంతి కోసం ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం



ప్రమాదానికి గురైన కారు

అగళి: మండల పరిధిలోని జాతీయ రహదారిపై ఆదివారం తెల్లవారుజామున అదుపు తప్పి ఓ కారు బోల్తా పడింది. స్థానికుల వివరాలమేరకు... హిందూపురంకు చెందిన నవీన్ కుటుంబ సభ్యులు కారులో పెళ్లి నిమిత్తం మంగళూరు బయలుదేరారు. అయితే అగళి జాతీయ రహదారి వద్ద కారు వెనుక చక్రం పంక్చరు అయింది. అతివేగంతో వెళుతున్న కారు అదుపుతప్పడంతో కారు బోల్తా పడింది. కారులోని వారికి మూగ దెబ్బలు తగలడంతో హుటాహుటిన 108 వాహనంలో హిందూపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కారులోని ఎయిర్ బ్యాగ్‌లు ఓపెన్ కావడంతో ప్రాణాపాయం నుంచి బయట పడినట్లు తెలిపారు.



హిందూపురంలోని చర్చి రోడ్డులో ట్రాఫిక్ ఇలా...



ఇందిరమ్మ సర్కిల్ వద్ద రోడ్డుపైనే నిలిపిన వాహనాలు

ట్రాఫికర్

- 'పురం'లో అస్తవ్యస్తంగా ట్రాఫిక్ వ్యవస్థ
- పట్టణంలో మితిమీరిన ఆక్రమణలు
- రోడ్లపైనే తోపుడుబండ్లు, వాహనాల పార్కింగ్
- ఇబ్బందుల్లో ప్రజలు

హిందూపురం పట్టణ జనాభా (దాదాపు)	2 లక్షలు
పట్టణంలో మొత్తం గృహాలు	36 వేలపైచిలుకు
ద్విచక్ర వాహనాలు, కార్లు (దాదాపు)	40 వేలు
రద్దీగా ఉండే ముఖ్య కూడళ్లు	5
ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్	1

హిందూపురం టౌన్: వాణిజ్యపరంగా ఎంతో పేరున్న హిందూపురం పట్టణంలో ట్రాఫిక్ సమస్య జఠిలమవుతోంది. దీంతో ప్రయాణికులు అనే అవస్థలు పడుతున్నారు. రహదారులు ఆక్రమణకు గురికావడం, నాలుగు చక్రాల వాహనాలు వెళ్లేందుకు సైతం రహదారులు వెడల్పు లేకపోవడంతో తరచూ ట్రాఫిక్ సమస్య నెలకొంటోంది. జిల్లా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు, అధికారులు తరచూ అదే ట్రాఫిక్‌లో అవస్థలు పడుతూ వెళ్తున్నారే తప్ప ఎవరూ పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు.

హిందూపురం పట్టణంలో రెండు లక్షల జనాభా ఉంది. పట్టణంలో ట్రాఫిక్ పోలీసుస్టేషన్, పోలీసు సిబ్బంది ఉన్నారు. రోజు రోజుకూ పెరుగుతున్న ట్రాఫిక్‌కు అనుగుణంగా మాత్రం అధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు చేపట్టడం లేదు. పట్టణంలో ముఖ్యంగా ఎన్టీఆర్ సర్కిల్ నుంచి మెయిన్ బజార్, గాంధీ చౌక్ నుంచి చిన్నమార్కెట్ వరకూ, డీఎల్ రోడ్డు, వీడీ రోడ్డు, కేఎల్ రోడ్డు, ఎంఎఫ్ రోడ్డు, బెంగళూరు రోడ్డు, చర్చి రోడ్డు తదితర ముఖ్య ప్రాంతాల్లో తరుచూ ట్రాఫిక్ సమస్య విపరీతంగా ఉంటోంది. ఈ రహదారుల్లో ట్రాఫిక్‌ను దాటుకుని వెళ్లాలంటే ఓపిక ఉండాల్సిందే. వీటికి తోడు ఎక్కడబడితే అక్కడే వాహనాలు పార్కింగ్ చేస్తుండటం, రోడ్లపైన తోపుడు బండ్లు, వ్యాపారస్తులు వస్తువుల దిగుమతులు, ఎగుమతులు జరుగుతుండడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోంది. దీనికి తోడు రోడ్లపైన పశువులు సంచరిస్తూ ప్రధాన కూడళ్లల్లో సేదతీరు వాహనాదారులకు తీవ్ర ఇబ్బందులు కలగజేస్తున్నాయి.

ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు ఎప్పుడో?

తరచూ ట్రాఫిక్ సమస్యతో ఇటూ వాహనదారులే కాకుండా పాదచారులకు ఇబ్బందులు తప్పడం లేదు. వాణిజ్య నగరంలో పేరున్న పురానికి రోజూ ఆంధ్ర, కర్ణాటక నుంచి వేలాది మంది వచ్చి వెళ్తుంటారు. ట్రాఫిక్‌ను నియంత్రణలో భాగంగా ట్రాఫిక్ సిగ్నల్స్‌ను ముఖ్య కూడళ్లలో ఏర్పాటు చేసి సమస్య లేకుండా చేయాలని వాహనాదారులు కోరుతున్నారు. పట్టణంలోని ఎన్టీఆర్ సర్కిల్, గురునాథ్, రహమత్‌పురం, మేళాపురం, చిన్నమార్కెట్ తదితర ప్రాంతాల్లో ట్రాఫిక్ సిగ్నల్స్‌లను ఏర్పాటు చేయాలనే ప్రతిపాదనలు గతం నుంచి ఉన్నాయి. అప్పట్లో వీటి కోసం స్థల పరిశీలనలు జరిగాయి. అయితే ఏవీ కార్యరూపం దాల్చలేదు. ఎమ్మెల్యేగా బాలకృష్ణ చొరవ తీసుకుని సిగ్నల్స్‌ను ఏర్పాటు చేయాలని పట్టణ వాసులు కోరుతున్నారు.

విచ్చలవిడిగా ఆక్రమణలు

జనాభా పెరుగుదలకు అనుగుణంగా రోడ్డును విస్తరించడం మాటెలా ఉన్నా రోడ్డును కూడా కాపాడుకోలేని పరిస్థితులు పట్టణంలో నెలకొన్నాయి. పట్టణంలో ప్రధాన రహదారులైన ఎన్టీఆర్ సర్కిల్ నుంచి మేళాపురం తెలుగుతల్లి సర్కిల్ వరకూ, ఎన్టీఆర్ సర్కిల్ నుంచి గాంధీ చౌక్, చిన్నమార్కెట్ వరకూ, ఎంఎఫ్ రోడ్డు, చిన్నమార్కెట్ వరకూ రోడ్డు ఎక్కువగా ఆక్రమణకు గురైంది. కాలువలపైనే కాకుండా రోడ్లను సైతం ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారు. ఎంఎఫ్ రోడ్డు, మెయిన్ బజార్‌రోడ్డు అసలే చిన్నవి కావడం, ఆపై ఆక్రమణలు, వాహనాల పార్కింగ్‌లతో ఇరుకుగా తయారయ్యాయి. ఈ రహదారుల్లో ఒక్క పెద్ద వాహనం వచ్చిన ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. ద్విచక్రవాహనాలు సైతం దాటలేని పరిస్థితి.

ఎమ్మెల్యే బాలకృష్ణ చొరవ చూపేనా?

హిందూపురం పట్టణంలో ట్రాఫిక్ అంశం పెద్ద సమస్యగా మారింది. రోడ్డు ఆక్రమణలు, రోడ్లపైనే తోపుడుబండ్లు, వాహనాల పార్కింగ్‌తో సమస్య తీవ్రమైంది. ట్రాఫిక్ పోలీసులు సైతం వీటిని నియంత్రించలేని పరిస్థితి నెలకొంది. రోడ్లపై ఆక్రమణల తొలగింపుతో పాటు వాహనాల పార్కింగ్, తోపుడుబండ్లు తదితర వాటిపై అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇస్తే తప్ప సమస్య తీరేలాలేదు. ట్రాఫిక్ సమస్యను నియంత్రించాలంటే ఎమ్మెల్యే బాలకృష్ణ ప్రత్యేక చొరవ చూపాలని ప్రజలు కోరుతున్నారు.

ఇబ్బంది పడుతున్నాం



పట్టణంలో ప్రధాన రహదారుల్లో నిత్యం ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. ఎక్కడబడితే అక్కడే వాహనాలు, తోపుడుబండ్లు రోడ్లపై ఉంచుతున్నారు. దీంతో వాహనాలే కాకుండా, నడిచి వెళ్లడానికి ఇబ్బందిగా ఉంది. మెయిన్ బజార్ రోడ్డు, ఎంఎఫ్ రోడ్డుల్లో ద్విచక్ర వాహనాల్లో వెళ్లాలంటే చాలా సమయం పడుతోంది. దీంతో రోజూ ఇబ్బందులు పడాల్సి వస్తోంది.

– రవి, హిందూపురం

ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు



పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణకు నిరంతరం చర్యలు తీసుకుంటున్నాం. ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ సిబ్బంది ద్వారా ముఖ్యకూడళ్లలో పాయింట్‌లను ఏర్పాటు చేసుకుని, ట్రాఫిక్ సమస్య రాకుండా చూస్తున్నాం. రోడ్లపైనే పార్కింగ్‌పై ప్రత్యేక దృష్టి సారించి సమస్య రాకుండా చూస్తాం. పలు చోట్ల వన్‌వే ను అమలు చేస్తున్నాం. ఎక్కడా ట్రాఫిక్ జామ్ కాకుండా చర్యలు చేపడుతున్నాం.

– రాజగోపాల్‌నాయుడు, వన్‌టౌన్ సీఐ



సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద రోడ్డుపైన నిలిపి ఉంచిన వాహనాలు

గోరంట్ల సీఐగా బాధ్యతలు స్వీకరించిన శేఖర్



గోరంట్ల: పట్టణంలోని అప్‌గ్రేడ్ పోలీసుస్టేషన్ సీఐగా బోయ శేఖర్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ సీఐగా విధులు నిర్వహిస్తున్న సుబ్బరాయుడు ఎస్పీ కార్యాలయానికి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో అనంతపురం ఎస్పీ ఆఫీసులో విధులు నిర్వహిస్తున్న బోయ శేఖర్‌ను ప్రభుత్వం నియమించింది. దీంతో ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా శేఖర్ మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయంగా పనిచేస్తానని, ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉంటానని తెలియజేశారు.

నేటి నుంచి సర్పంచులకు శిక్షణ

రొళ్ల: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయ ఆవరణలో సోమ, మంగళ, బుధవారం మూడు రోజుల పాటు పంచాయతీ అభివృద్ధి పనులపై సర్పంచులకు శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగానే గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కారం, వీధి దీపాల ఏర్పాటు, డ్రైనేజీల శుభ్రం, పారిశుద్ధ్య పనులతో పాటు సర్పంచుల విధులు ఇతరాత్ర అభివృద్ధి పనులపై శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. శిక్షణ తరగతులకు తప్పనిసరిగా సర్పంచులతో పాటు పంచాయతీ కార్యదర్శులు కూడా హాజరు కావాలని కోరారు.

భగవద్గీత వచనాలు సృష్టికి మూలం



పరిగిలో భగవద్గీత ప్రచారం చేస్తున్న దృశ్యం

పరిగి: ముల్లోకాలకు ఆరాధ్యుడు శ్రీకృష్ణ భగవానుడని, ఆయన బోధించిన భగవద్గీత వచనాలు సృష్టికి మూలాధారమని త్రైత సిద్ధాంతం- ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక సభ్యులు తెలిపారు. ఆదివారం పరిగి మండల కేంద్రంలో త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగానే భగవద్గీత పుస్తకావిష్కణ చేసి, పలువురికి పంపిణీ చేశారు. కార్యక్రమంలో త్రైత సిద్ధాంతం-ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక ముద్దిరెడ్డిపల్లి అధ్యక్షుడు ఆదినారాయణ, శేఖర్, క్రిష్టప్ప, మునీంద్ర, గణేష్, సుభద్ర, జ్యోతి, కోనమ్మ, పార్వతమ్మ తదితరులు పాల్గొన్నారు.

శాంతి భద్రతల పరిరక్షణకు ప్రాధాన్యం



హిందూపురం రూరల్ సీఐగా బాధ్యతలు స్వీకరించిన జనార్దన్



అప్‌గ్రేడ్ సీఐగా బాధ్యతలు చేపట్టిన ఆంజనేయులు

హిందూపురం అర్బన్: శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యం ఇస్తామని నూతనంగా బాధ్యతలు చేపట్టిన అప్‌గ్రేడ్ పోలీసుస్టేషన్, రూరల్ పోలీసుస్టేషన్ సీఐలు ఆంజనేయులు, జనార్దన్ పేర్కొన్నారు. వారు ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఆంజనేయులు మాట్లాడుతూ గతంలో అప్‌గ్రేడ్ పరిధిలో ఎస్ఐగా చేసిన అనుభవం ఉందన్నారు. హిందూపురం మండలంతో పాటు తూమకుంట పారిశ్రామికవాడలో పని చేసే కార్మికులు, ఉద్యోగులు ఏ సమస్య వచ్చినా తోడుగా పోలీస్ అధికారులు ఉంటారన్నారు. సీఐ జనార్దన్ మాట్లాడుతూ లేపాక్షి, చిలమత్తూరు మండలాల్లో ప్రజలు ప్రశాంత వాతావరణంలో ఉండేందుకు తనవంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. నిబంధనలు అతిక్రమించి వాహనాలు నడిపేవారు, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిని ఉపేక్షించేది లేదన్నారు. ఇసుక, మద్యం తరలిపోకుండా ప్రత్యేక తనిఖీలు చేపడుతామన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

లేపాక్షి: మండలంలోని చోళసముద్రం జాతీయ రహదారిలో ఉన్న సర్కిల్ వద్ద ఆదివారం సాయంత్రం ఎస్ఐ గోపీతో పాటు పోలీసు సిబ్బంది వాహనాల తనిఖీ చేశారు. తనిఖీలో బాగంగా రికార్డులు, డ్రైవింగ్ లైసెన్సు, హెల్మెట్ తదితర వాటిని తనిఖీ చేసి నిబంధనలు ఉల్లంఘించిన వారికి అపరాధ రుసుము విధించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. డ్రైవింగ్ లైసెన్సు ఉండాలని, వాహనాల్లో అధిక లోడుతో వెళ్లకూడదన్నారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని తెలియజేశారు.

అంబేడ్కర్ విగ్రహంపై దాడి అమానుషం

- మాజీ ఎమ్మెల్యే తిప్పేస్వామి

మడకశిర: విజయవాడలోని అంబేడ్కర్ సామాజిక న్యాయ మహాశిల్పంపై దుండగులు దాడి చేయడం అమానుషమని స్థానిక మాజీ ఎమ్మెల్యే తిప్పేస్వామి ఒక ప్రకటనలో ఖండించారు. విగ్రహం ఎదుట ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని ధ్వంసం చేయడం అన్యాయమన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రోత్సాహంతోనే టీడీపీ కార్యకర్తలు ఈఘటనకు పాల్పడ్డారన్నారు. బాధ్యులను గుర్తించి ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో అంబేడ్కర్ విగ్రహాలకు రక్షణ కల్పించాలని కోరారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్త మృతి



దేవరాజు భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప

గుడిబండ: మండల కేంద్రానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త దేవరాజు (41)గుండెపోటుతో ఆదివారం చనిపోయారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప... దేవరాజు మృతదేహం వద్ద పుష్పగుచ్చాలు ఉంచి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. అధైర్య పడొద్దని, వైఎస్సార్‌సీపీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త వెంట సర్పంచ్ కరుణాకర్, నాయకులు నటరాజు, మునీర్, యువరాజు, ఈరన్న, తిప్పేస్వామి తదితరులు ఉన్నారు.

శుభకార్యం

అమరాపురం: మండలంలోని హేమావతి, అమరాపురంలో జరిగిన పలు శుభకార్యాల్లో వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప పాల్గొన్నారు. హేమావతి వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు గోవిందరాయ నూతనంగా నిర్మించిన గృహ ప్రవేశానికి ఈరలక్కప్ప హాజరై వారికి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే అమరాపురంలోని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ త్రిలోక్‌నాథ్ సోదరి శ్రీదేవి, హనుమంతరాయల గృహ ప్రవేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఈరలక్కప్ప మాట్లాడుతూ మండలంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పార్టీ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఆయన వెంట రాష్ట్ర వైఎస్సార్‌సీపీ సంయుక్త కార్యదర్శి వాగేష్, స్థానిక సర్పంచ్ తిప్పేస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్టాపన



ఆంజనేయస్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠించిన దృశ్యం

మడకశిర: పట్టణంలోని 15వ వార్డు పరిధిలో ఆదివారం ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. వార్డు పరిధిలోని ప్రజలు ఎంతో భక్తిశ్రద్ధలతో విగ్రహ ప్రతిష్ఠలో పాల్గొన్నారు. శనివారం రాత్రి నుండి ఆదివారం మధ్యాహ్నం వరకు విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమం కొనసాగింది. ఈ సందర్భంగా వేద పండితులు హోమాలు, పూజలు నిర్వహించారు. వచ్చిన భక్తులందరికీ పెద్ద ఎత్తున అన్నదానం చేశారు. స్థానిక కౌన్సిలర్ నరసింహరాజు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, మాజీ ప్రజా ప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

కంటి జబ్బులను నిర్లక్ష్యం చేయొద్దు

పావగడ: కంటి జబ్బులను ఎవరూ నిర్లక్ష్యం చేయకూడదని స్థానిక సూరపనేని విద్యాసాగర్ ఫౌండేషన్ అధ్యక్షుడు సూరపనేని విద్యాసాగర్ సూచించారు. తాలూకాలోని నాగలమడక గ్రామం గురుకుల పాఠశాలలో శంకర కంటి ఆస్పత్రి సహకారంతో విద్యాసాగర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో ఆయన మాట్లాడారు. యోగాతో అన్ని రోగాలు మాయమవుతాయని, ప్రాణాయమంతో ఊపిరితిత్తులు ఆరోగ్యకరంగా ఉంటాయన్నారు. ఈ సందర్భంగా కంటి వైద్య శిబిరానికి అధిక సంఖ్యలో కంటి బాధితులు తరలివచ్చారు. శంకర కంటి ఆస్పత్రి వైద్యులు యమున, ప్రణయ్, శశికిరణ్ రోగులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. శస్త్ర చికిత్సకు ఎంపికైన వారిని బెంగళూరులోని శంకర కంటి ఆస్పత్రికి తరలించారు.

హిందూపురం ఎంపీడీఓగా నరేంద్రకుమార్

హిందూపురం అర్బన్: హిందూపురం ఎంపీడీఓగా నరేంద్రకుమార్ బాధ్యతలను ఆదివారం స్వీకరించారు. ఎన్నికల ముందు మరో జిల్లాకు బదిలీపై వెళ్లగా తిరిగి హిందూపురం ఎంపీడీఓగా బాధ్యతలు చేపట్టారు. తోటి ఉద్యోగులు, ప్రజాప్రతినిధుల సహకారంతో మండల అభివృద్ధికి కృషి చేస్తామని ఎంపీడీఓ నరేంద్రకుమార్ తెలిపారు.

సజావుగా వీఎస్ఎస్ఎన్ ఎన్నికలు

పావగడ: తాలూకాలోని వెంకటాపురం వీఎస్ఎస్ఎన్ సంఘం ఎన్నికలు ఆదివారం సజావుగా జరిగాయి. మొత్తం 12 డైరెక్టర్ల స్థానాలకు కాంగ్రెస్, కూటమి పార్టీల నుంచి 22 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. మరో ఇద్దరు స్వతంత్ర్య అభ్యర్థులు సైతం బరిలో ఉన్నారు. మొత్తం 8 గ్రామాలకు చెందిన ఓటర్లు 839 మంది ఉన్నారు. అయితే కాంగ్రెస్, కూటమి అభ్యర్థుల మధ్యే గట్టి పోటీ నెలకొంది. ఓట్ల లెక్కింపును కూడా వెంటనే ప్రారంభించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గట్టి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

యువకుడికి తీవ్రగాయాలు

చిలమత్తూరు: మండలంలోని పెద్దనపల్లి క్రాస్ 44వ నంబరు జాతీయ రహదారిపై శనివారం అర్ధరాత్రి ద్విచక్ర వాహనం డివైడర్‌ను ఢీకొన్న సంఘటనలో అనంతపురానికి చెందిన సుబహాన్‌కు తీవ్ర గాయాలయ్యాయి. కానిస్టేబుల్ రమేష్ క్షతగాత్రుడిని 108 ద్వారా బాగేపల్లి ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

భక్తిశ్రద్ధలతో కలశ స్థాపన పూజలు

- నేడు శివలింగంతో పాటు వివిధ దేవతా విగ్రహాల ప్రతిష్టాపన



కలశ స్థాపన పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

మడకశిరరూరల్: మండల పరిధిలోని ఆమిదాలగొంది గ్రామంలో నూతనంగా నిర్మించిన శివాలయంలో విగ్రహాల ప్రతిష్టాన ఉత్సవాల్లో భాగంగా ఆదివారం పురోహితులు ఆలయంలో వివిధ పూజ కార్యక్రమాలను నిర్వహించారు. ఆలయంలో గంగపూజ, సవత్సధేను సమేత ఆలయ ప్రవేశం, దిగ్విజులు, చతుష్టాలకులు, నవగ్రహ, మృత్యుంజయ, సప్తసభావదేవతలు, ఏకాదశ చండేశ్వర, అష్ట భైరవ, నవ దుర్గాదేవతలు, నవ నాగులు తదితర పూజ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. మహా మంగళ హారతి ఇచ్చి భక్తులకు ప్రసాద వినియోగం చేశారు. కమిటీ సభ్యులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సోమవారం మహాగణపతి, శివలింగం, పార్వతీమాత, సుబ్రహ్మణ్య, నందీశ్వర నూతన విగ్రహాలు, ధ్వజస్తంభం, విమాన గోపురం తదితర ప్రతిష్టాన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వీరశైవ లింగాయత్ శివాలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఉత్సవాలకు సిద్ధరబెట శ్రీక్షేత్ర వీరభద్ర శివాచార్యస్వామీజీ, ధర్మస్థల శ్రీక్షేత్ర ధర్మాధికారి వీరేంద్రహెగ్గడె, పావగడ రామకృష్ణ సేవా ఆశ్రమ అధ్యక్షుడు జపానందస్వామీజీ ,రాజకీయ పార్టీల ముఖ్య నాయకులు తదితరులు హాజరుకానున్నట్లు నిర్వాహకులు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విగ్రహాల ప్రతిష్టాపన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.